క్లుప్తంగా

సచివాలయాల తనిఖీ



జియో ట్యాగింగ్ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి

వెలుగోడు: వేల్పనూరు, రేగడ గూడూరుతో పాటు మండల కేంద్రంలోని సచివాలయాలను బుధవారం ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వేను పర్యవేక్షించి సిబ్బందికి సూచనలిచ్చారు. సర్వేలో పొందుపరిచిన కుటుంబ వివరాలను యజమాని నుంచే తీసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. యజమాని ఆధార్ అథెంటికేషన్ తప్పనిసరిగా అన్నారు. ఈనెల 15 లోపు జియో ట్యాగింగ్ పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శులు సుంకన్న, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పలకల తొలగింపు

జూపాడుబంగ్లా: 'సాక్షి' దినపత్రికలో ఈనెల 12న 'మొక్కలకు కంచెగా పలకలు' శీర్షికన వెలువడిన కథానికి ఐసీడీఎస్ అధికారులు సానుకూలంగా స్పందించారు. రామసముద్రం గ్రామానికి చేరుకొని అంగన్‌వాడీ కేంద్రం వెనకాల మొక్కలకు కంచెగా పెట్టిన పలకలను తీయించారు. కేంద్రానికి మంజూరైన పలకల వివరాలను అంగన్‌వాడీ కార్యకర్త లలితను అడిగి తెలుసుకొన్నారు. కేంద్రానికి మంజూరైన వస్తువులను విద్యార్థులకు మినహా ఇతర కార్యకలాపాలకు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని అంగన్‌వాడీ కార్యకర్తను ఐసీడీఎస్ అధికారులు హెచ్చరించారు.

ఇంటింటి సర్వే త్వరగా పూర్తి చేయండి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: ఇంటింటి జియోట్యాంగింగ్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మండలంలోని రుద్రవరం, తుమ్మలూరు గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఎంపీడీఓ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీలోగా సర్వేను పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

18న సచివాలయాల ముట్టడి

కొత్తపల్లి: పేదలకు మూడు సెంట్లు స్థలంతో గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18వ తేదీన చేపట్టనున్న సచివాలయాల ముట్టడిని విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకటశివుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండలంలోని సింగరాజుపల్లె గ్రామంలో నాయకులు ముట్టడికి సంబంధించిన కరపత్రాల పంపిణీ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పేదలకు సంబంధించిన వ్యక్తిగత అర్జీల అధికారులకు సమర్పించి నిరసన చేపడుతామని ఆయన తెలిపారు.

మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళా వేదికపై విజయవాడకు చెందిన గాయత్రి నృత్య నికేతన్ వారి సంప్రదాయ నృత్యం, ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన గోదా నాగమణి వారి భక్తి సంగీత కార్యక్రమాలు అలరించాయి.

వీరబ్రహ్మేంద్రస్వామికి మహానందీశుడి పట్టువస్త్రాలు



పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న ఈఓ శ్రీనివాసరెడ్డి

మహానంది: మహానందీశ్వరస్వామి దేవస్థానం తరఫున వీరబ్రహ్మేంద్రస్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో స్వామివారికి కల్యాణం జరుగుతున్న నేపథ్యంలో సంప్రదాయం మేరకు ఈఓ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ వై.మధు, వేదపండితులు ఆంజనేయశర్మ, శాంతారాం భట్, ఉప ప్రధాన అర్చకులు శంకరయ్య శర్మ, అర్చకులు సుబ్బయ్యశర్మ బుధవారం పట్టువస్త్రాలు తీసుకెళ్లి వీరబ్రహ్మేంద్రస్వామికి సమర్పించారు.

ఉపాధి పనుల పరిశీలన

బండిఆత్మకూరు: మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను డ్వామా పీడీ జనార్దన్‌రావు బుధవారం పరిశీలించారు. బి.కోడూరు గ్రామ పరిధిలోని పనులను, పార్నపల్లి గ్రామంలో సిమెంట్ రోడ్డు, డైనేజీ పనులను, వెంగలరెడ్డి పేట గ్రామంలో మినీ గోకులం షెడ్డును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ దస్తగిరి ఉన్నారు.

మల్లన్న భక్తులకు చుక్కెదురు

- భైర్లూటి వద్ద పాదయాత్రను అడ్డుకున్న అటవీఅధికారులు
- భక్తుల ఆందోళన
- వెంకటాపురం మీదుగా పంపిన డీఎఫ్ఓ



భైర్లూటీ వద్ద శివభక్తులను అడ్డుకున్న అటవీశాఖ అధికారులు

ఆత్మకూరు: కాలినడకన శ్రీశైలానికి బయలుదేరిన భక్తులను భైర్లూటి వద్ద అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. అటవీ చట్టం ప్రకారం అనుమతి లేదని చెప్పడంతో భక్తులు అక్కడే ఆందోళనకు దిగారు. డీఎఫ్ఓ అక్కడికి చేరుకుని వెంకటాపురం మీదుగా వెళ్లాలని భక్తులకు నచ్చజెప్పి పంపిచారు. భక్తులు తెలిపిన వివరాలు.. ఆత్మకూరు, పాములపాడు మండలాలకు చెందిన శివభక్తులు శ్రీశైల క్షేత్రానికి కాలినడకన వందల సంఖ్యలో బయలుదేరారు. భైర్లూటీ, నాగలూటి, పెచ్చెరువు, భీమునికొలను మీదుగా శ్రీశైలం క్షేత్రానికి చేరుకోవాలనేది భక్తుల ప్రణాళిక. అయితే భైర్లూటీ వద్ద పాదయాత్రకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని శివభక్తులను ఫారెస్టు అధికారులు అడ్డుకున్నారు. తాము పాదయాత్ర కొనసాగిస్తామని భక్తులు అక్కడే ఆందోళనకు దిగారు. అటవీచట్టం రాక ముందు నుంచి కూడా శ్రీశైల క్షేత్రానికి కాలినడకన వెళ్లేందుకు ఇదే రహదారి అని పలువురు భక్తులు వివరించారు. అటవీశాఖ అధికారులు ఇలా అడ్డుకోవడం తగదని ఆవేదన వ్యక్తం చేయగా వన్యప్రాణులకు ఇబ్బందులు కలుగుతుండటంతో నిషేధించామని అటవీ అధికారులు తెలిపారు. విషయాన్ని స్థానిక భైర్లూటీ రేంజ్ అధికారులు డీఎఫ్ఓ సాయిబాబా దృష్టికి తీసుకెళ్లగా ఆయన అక్కడికి చేరుకుని భక్తులతో మాట్లాడారు. వెంకటాపురం మీదుగా కాలినడకన అనుమతిస్తామని, భైర్లూటీ, ఇతర మార్గాల మీదుగా కాలినడకన వెళ్లేందుకు తాము అనుమతించబోమని తేల్చి చెప్పడంతో చేసేదేమీ లేక భక్తులు వెంకటాపురం నుంచి కాలినడకన బయలుదేరి వెళ్లారు. కాగా ఏటా కార్తీకమాసంలో వందలాది మంది భక్తులు శ్రీశైలం క్షేత్రానికి వెంకటాపురం, భైర్లూటీ మీదుగా వెళ్లేవాళ్లని భక్తులు తెలిపారు.

అపార్‌కు సర్వర్ కష్టాలు



ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద చెట్ల క్రింద పడిగాపులు కాస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పాములపాడు: వన్‌నేషన్ – వన్ స్టూడెంట్ నినాదంలో భాగంగా విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆపార్ కార్డుల జారీకి సర్వర్ సమస్యతో కష్టాలు తప్పడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్‌లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతి విద్యార్థి విద్యార్హత ధృవీకరణ పత్రాలు, ఆధార్‌లో పేరు (అక్షరదోషాలు లేకుండా), పుట్టిన తేదీ వివరాలు ఒకే మాదిరిగా ఉండాలి. అయితే అలా లేని వాటిని సవరణ చేసుకునేందుకే ఆధార్ నమోదు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశారు. మండలంలో ఉన్న 13 గ్రామ సచివాలయాలకుగాను చెలిమిల్ల, ఇస్కాల, మిట్టకందాల గ్రామాల్లోని 3 సచివాలయాల్లో ఆధార్ నమోదు మిషనరీ ఉంది. అయితే మూడుచోట్ల మరమ్మత్తులకు గురవడంతో అప్పట్లో ఆధార్ అప్డేట్ నమోదు సాధ్యం కాలేదు. ప్రస్తుతం ఈ నెల 11 నుంచి 13 వరకు తేదీ ప్రకటిస్తూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆధార్ సేవలు ఏర్పాటు చేశారు. బుధవారం చివరి రోజు కావడంతో విద్యార్థులు, వారి తల్లి దండ్రులు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. సర్వర్ సమస్య తలెత్తడంతో ఉదయం నుంచి పడిగాపులు తప్పడం లేదు. తేదీ పొడిగిస్తారా లేక బంద్ చేస్తారా అనే అనుమానాలు విద్యార్థుల్లో తలెత్తుతున్నాయి.

భైరెడ్డి సిద్దార్థరెడ్డిపై కేసు కొట్టివేత హర్షనీయం



కోర్టు బయట భైరెడ్డి సిద్ధార్థరెడ్డికి అభినందనలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జూపాడుబంగ్లా: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం నేత భైరెడ్డి సిద్ధార్థరెడ్డిపై బనాయించిన మర్డర్ కేసును బుధవారం ప్రజాప్రతినిధుల కోర్టు కొట్టివేయడం హర్షనీయమని జెడ్పీటీసీ సభ్యుడు పోచా జగదీశ్వరరెడ్డి, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు తిరుమలేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు తోకల కృష్ణారెడ్డి, జేసీఎస్ మండల నాయకుడు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్ల క్రితం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన సాయిఈశ్వరుడు హత్యకు సంబంధించి భైరెడ్డి సిద్ధార్థరెడ్డిపై కేసు నమోదు చేయడం దురదృష్టకరమన్నారు. నేరం రుజువుకాకపోవటంతో విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టు కేసును కొట్టివేయడం ఎంతో శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల యూత్ నాయకుడు తరుణ్‌కుమార్‌రెడ్డి, పగిడ్యాల మాజీ జెడ్పీటీసీ, మండల కన్వీనర్ పుల్యాల నాగిరెడ్డి, లక్ష్మాపురం మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు చదువు నేర్పిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

నందికొట్కూరు: నిరక్షరాస్యులైన పొదుపు మహిళలకు చదువు నేర్పిద్దామని ఉల్లాస్ అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటి జిల్లా నోడల్ అధికారి భాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని స్త్రీ శక్తి భవనలో పొదుపు మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 15–50 సంవత్సరాల మధ్య వయస్సు గల చదువురాని నిరక్షరాస్యులకు సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు చదువు నేర్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రమణ్యం, ఎంఈఓ సుభాన్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు వెంకటేశ్వరమ్మ, అనురాధ, పొదుపు జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు మార్తమ్మ, ఏపీఎం శ్రీనివాసులు, సీసీలు రమణయ్య, దాసు, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఆత్మకూరు/వెలుగోడు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం నుంచి ఈనె 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆత్మకూరు, వెలుగోడు గ్రంథాలయాల అధికారులు రాకేష్, సుమలత తెలిపారు. బుధవారం వారు వేర్వేరుగా మాట్లాడుతూ 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారులైన ఎస్.ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య తదితరులను స్మరించుకోవడం, 17న స్వాతంత్ర్య పోరాటంపై ప్రముఖులు, స్వాతంత్ర్య సమరయోధుల ప్రసంగాలు, 18న గ్రంథాలయ ఆవశ్యకతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు ఉంటాయన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తామన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో డీపీఓ



నాగరాజునాయుడును సన్మానిస్తున్న పండితులు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో బుధవారం అనంతపురం జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, పండితులు వారికి స్వాగతం పలికారు. కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన చేపట్టారు. స్థానిక అలంకార మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు. అలాగే నంద్యాల డీఎస్పీ శ్రీనివాసరెడ్డి మహానందీశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం ఆలయ అధికారులు ఆయనకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

యువతి ఆత్మహత్య

వెలుగోడు: పట్టణానికి చెందిన యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఎస్సీ కాలనీకి చెందిన నరసింహులు, జ్యోతి దంపతుల కుమార్తె జిల్లెల పుష్ప(19) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అప్పటికే మృతి చెందిందని వైద్యాధికారి నిర్ధారించారు. మృతురాలి తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విష్ణు నారాయణ తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

సంక్షిప్తం

పనికిరాని కూలీల జాబుకార్డులు తొలగించండి

కొత్తపల్లి: ఉపాధి పనులకురాని కూలీలు, మృతి చెందిన వ్యక్తుల జాబుకార్డులను తొలగించాలని ఏపీఓ హరికృష్ణ సూచించారు. బుధవారం స్థాని ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదేవిధంగా 10 ఎకరాల పైన ఉన్నవారి జాబుకార్డులు కూడా తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ రాజునాయక్, సిబ్బంది ఉన్నారు.

వయోజన విద్యా వలంటీర్లకు శిక్షణ

కొత్తపల్లి: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో బుధవారం ఏపీఎం పుల్లయ్య అధ్యక్షతన ఉల్లాస్ వయోజన విద్యా వలంటీర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబం, ఆచారాలు, సంప్రదాయాలు, ఆరోగ్యం, పరిశుభ్రత, ఎన్నికలు, పిల్లల పెంపకం, చట్టాలపై అవగాహన కల్పించారు.

విద్యా దానం గొప్పది

మిడుతూరు: అన్ని దానాలకన్న విద్యాదానం గొప్పదని ఎంపీడీఓ దశరథ రామయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ వయోజన విద్యా వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోజనులకు విద్యను అందించేందుకు విద్యా వలంటీర్లు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఆర్‌పీ రమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక, సీసీలు పాల్గొన్నారు.

సోషల్ మీడియా ప్రతినిధుల అరెస్టు దుర్మార్గం

నందికొట్కూరు: రాష్ట్రంలో సోషల్ మీడియా యాక్టివిస్టులను అరెస్టులు చేసి కుటుంబాలను భయంభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దార సుధీర్ ఖండించారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న తీరుపై మండిపడ్డారు. సోషల్ మీడియా యాక్టివిస్టుల అరెస్టులు, అక్రమ నిర్బంధాలు దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు జగనన్నపై రఘురాం, పటాభి నిత్యం అనేక రకాలుగా విమర్శించినా ఒక కేసు అయినా నమోదు చేయలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఇలాంటి విషయాలకు ప్రభుత్వం స్వస్తి చెప్పాలని, లేని పక్షంలో ప్రజల తిరుగుబాటును చవిచూస్తారని హెచ్చరించారు.

ముసలిమడుగులో పొలంబడి

నందికొట్కూరు: మండల పరిధిలోని వడ్డేమాన్, కోనేటమ్మపల్లి గ్రామాల్లో బుధవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ స్థాయి వ్యవసాయ అధికారి విజయశేఖర్ శనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనగ పంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. పూత దశలో నీటి ఎద్దడికి గురి కాకుండా చూసుకోవాలన్నారు. పంట మార్పిడి, అధిక ఉత్పత్తి వంగడాల సాగుతో లాభాలు వస్తాయన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కొత్తపల్లి: మినుము పంటలో పల్లాకు తెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ మహేష్ అన్నారు. బుధవారం మండలంలోని గోకవరం, ఎదురుపాడు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ సందర్భంగా ఏఓ రైతులకు వివరించారు. రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు సంబంధించి బీమా ప్రిమియం డిసెంబర్ 15లోపు చెల్లించాలని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

బండిఆత్మకూరు: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ శ్రీనివాసుల్ రెడ్డి సూచించారు. బుధవారం ఆయన ఎస్ఐ జగన్మోహన్‌తోకలిసి మండల పరిధిలోని ఈర్నపాడు గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులకు 1930 నంబర్ ప్రాముఖ్యతను తెలియజేశారు. మొబైల్ వాట్సాప్‌లో వచ్చే అనవసర లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. మహిళలు, చిన్నపిల్లల పట్ల జరిగే నేరాలు, బాలవివాహాల వల్ల కలిగే దుష్పరిమాణాలు, 100, 112 నంబర్ల ప్రాముఖ్యతను వివరించారు.

ట్రాక్టర్ ప్రమాదంలో ఇద్దరు మృతి

బండిఆత్మకూరు: మండల పరిధిలోని ఓంకారం క్షేత్ర సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా మరో ఇద్దరు గాయపడినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. ఓంకారం క్షేత్ర సమీప కొండపై ఉన్న ఆలయానికి బియ్యం, ఇతర సామగ్రి అందజేసి తిరుగు ప్రయాణం సమయంలో ట్రాక్టర్ బోల్తా పడింది. ప్రమాదంలో ఏ.కోడూరు గ్రామానికి చెందిన బిజ్జం చెన్నారెడ్డి(50), బండిఆత్మకూరు గ్రామానికి చెందిన వడ్డె శ్రీనివాసులు(42) మృతి చెందగా ఏ.కోడూరు చిన్నన్న, శేషన్న గాయపడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

నందికొట్కూరు: ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్‌బాబు బుధవారం తెలిపారు. ఈ ఏడాది మార్చిలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి షకుమార్, రవీంద్రారెడ్డి తన నుంచి రూ.6 లక్షలు తీసుకుని మోసం చేశారని జగదీష్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

పాములపాడు: పంట సాగులోమెలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏఈఓ మద్దిలేటి తెలి పారు. బుధవారం మండలంలోని పాములపాడు, లింగాల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న,వేరుశనగ,మినుము పంటలను పరిశీలించి చీడపీడల నివారణ చర్యలు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది గాయత్రి, సునీత, రైతులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ఉద్యోగినిపై వేటు

మహానంది: మహానంది దేవస్థానంలోని పెద్దనంది వద్ద విధులు నిర్వహిస్తున్న ఏజెన్సీ ఉద్యోగిని పావనిపై భక్తుల ఫిర్యాదు మేరకు వేటు వేశారు. నంది ప్రాంగణం ప్రవేశ రుసుం రూ.10. కాగా అక్కడ విధులు నిర్వహిస్తున్న ఏజెన్సీ ఉద్యోగిని పావణి భక్తుల నుంచి డబ్బు తీసుకుని టికెట్ ఇవ్వకుండా చేతివాటం ప్రదర్శిస్తుండటాన్ని పలువురు భక్తులు ఈఓ శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించడంతో పాటు విచారణ చేపట్టి నిజమని నిర్ధారణ కావడంతో విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తూ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

18న మాదిగల ఆత్మీయ సమ్మేళనం



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ఆత్మకూరు: ఈనెల 18న కర్నూలులోని కోల్స్ కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఉమ్మడి కర్నూలు జిల్లా మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారని, మాదిగలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మదనపల్లి బుజ్జి కోరారు. బుధవారం నాయకులు బాషా, పోగుల దరగయ్యతో కలిసి ఆయన సమ్మేళన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలయ్యేంతవరకు గ్రూప్–1, డీఎల్, జేఎల్, డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీ నియామక ప్రక్రియను నిలిపేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు వనమాల పుల్లయ్య, మిద్దెల వరదరాజులు, షాబోలు రామారావు, కర్నాటి లింగస్వామి పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' అమలు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యేసురత్నం, సీనియర్ నాయకులు రాజశేఖర్, రజాక్ విమర్శించారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలను తగ్గించకపోగా విద్యుత్ చార్జీలను పెంచడం దారుణమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రణధీర్, రామ్‌నాయక్, షేక్ ఇస్మాయిల్, సద్దాంహుసేన్, భాస్కర్, కిరణ్, గణపతి, రవి తదితరులు పాల్గొన్నారు.

పశువుల గణన వేగవంతం చేయండి

జూపాడుబంగ్లా: పశువుల గణన వేగవంతం చేయాలని పశుసంవర్ధకశాఖ అసిస్టెంటు డైరెక్టర్ రామాంజనేయులు తెలిపారు. మండల పరిధిలోని పోతులపాడులో జరుగుతున్న పశుగణనను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లకోసారి జరిగే పశుగణన పకడ్బందీగా నిర్వహించాలని, సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.

గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

గోకులం షెడ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ రామాంజనేయులు, ఏపీఓ గౌరీబాయి తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలానికి 35 గోకులం షెడ్లు మంజూరు కాగా వాటిల్లో పశువులు, కోళ్ల పెంపకానికి సంబంధించిన షెడ్లు ఉన్నాయన్నారు. గోకులం షెడ్లను దుర్వినియోగం చేసినట్లు తెలిస్తే వారి నుంచి బిల్లులు రికవరీ చేస్తామని ఏడీ రామాంజనేయులు, ఏపీఓ గౌరీబాయి తెలిపారు.

ప్రతి ఒక్కరికీ అక్షరజ్ఞానం ఉండాలి

ప్రతి ఒక్కరికీ కనీస అక్షరజ్ఞానం ఉండాలని ఎంపీడీఓ గోపికృష్ణ , ఎంఈఓ–1 చిన్నమద్దిలేటి తెలిపారు. బుధవారం మండలంలోని జీవనజ్యోతి మండల మహిళాసమాఖ్య కార్యాలయంలో వయోజన విద్యావలంటీర్లకు ఓ రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 శ్రీనివాసులు, వయోజన విద్యా ప్రాజెక్టు ఆఫీసర్ ప్రతాప్, ఏపీఎం అంబమ్మ పాల్గొన్నారు.

ఆయిల్‌పాం తోటల పెంపకం లాభదాయకం



ఆయిల్‌పాం మొక్క నీరు పోస్తున్న పీడీ నాగరాజు

పాములపాడు: ఆయిల్‌ఫాం తోటల పెంపకం రైతులకు ఎంతో లాభదాయకమని ఉద్యానవనశాఖ జిల్లా అధికారి నాగరాజు తెలిపారు. బుధవారం మండలంలోని ఎర్రగూడూరు గ్రామంలో ఉద్యానవనశాఖ, పతాంజలి కంపెనీ సంయుక్తంగా ఆయిల్‌ఫాం తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పీడీ నాగరాజు మాట్లాడుతూ రాయితీ ద్వారా రైతులు ఆయిల్‌ఫాం తోటల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. నీటివసతి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆయిల్‌ఫాం తోటలపెంపకంలో రాణించటం ద్వారా లాభాలు ఆర్జించాలని సూచించారు. అనంతరం గ్రామానికి చెందిన జనార్దన్ పొలంలో ఆయిల్‌ఫాం మొక్కలను అధికారులు నాటించారు. కార్యక్రమంలో ఆత్మకూరు వ్యవసాయశాఖ ఏడీఏ ఆంజనేయులు, సెరికల్చర్ డీడీ పరమేశ్వరి, ఏడీ నగేష్, హార్టికల్చర్ అధికారిణి చందన, పతాంజలి కంపెనీ ఏజీఎం రామకృష్ణ, జిల్లా మేనేజర్ మహదేవ్, తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ సురేష్‌కుమార్ రెడ్డి

కొత్తపల్లి: గ్రామాలలో ప్రజలు గొడవలకు, అల్లర్లకు దూరంగా ఉండాలని ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ రెడ్డి, కొత్తపల్లి ఎస్ఐ ఎం.కేశవ సూచించారు. మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో సీఐ సురేష్ కుమార్ రెడ్డి, బావాపురం గ్రామంలో ఎస్ఐ కేశవ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రశాంత జీవనం అలవర్చుకోవాలని సూచించారు. చిన్న పిల్లలకు ద్విచక్రవాహనాలు ఇవ్వకూడదన్నారు.